సాక్షి సూర్యాపేట

గురువారం ౹ 26 ౹ జనవరి ౹ 2023



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 8లో



ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతం

మేలు జాతి ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతంగా ఉందని కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.°/18°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సూర్యాపేటటౌన్ : పద్దెనిమిది ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును ఎన్నికల్లో స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. యువత తమ ఓటు ద్వారా మంచి అభ్యర్థిని ఎన్నుకునే విధంగా దోహదపడాలన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్రప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న జేడీ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

చిలుకూరు: జంతువులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకుడు శ్రీనివాస్‌రావు అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమను కనబర్చాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వీరారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు పెంచకుండా తెలంగాణ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని తెలంగాణ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీలలో కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. తక్షణమే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానన్న కేసీఆర్ ప్రభుత్వ హామీని కేజీబీవీలలో కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్, జిల్లా కమిటీ సభ్యులు కామల్ల శ్రీను, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు జాని బేగం, గీత, రాములమ్మ, లక్ష్మి, నాగమణి, మౌనిక, కలమ్మ, అరుణ, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు

లబ్ధిదారులకు ఉచిత బస్‌పాసుల పంపిణీ

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాసులను తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు నయీమ్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 60 మంది దివ్యాంగులకు బస్‌పాసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్టీసీ డీఎం సుందర్, బొడ్డు శ్రీనివాస్, ఏల జానయ్య, సాగర్ నాయక్, కరీం పాషా, ఫరీద్ బాబా, అఖిల్, రవి, కృష్ణవేణి, సరిత పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

- కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహణ
- గెలుపొందిన ఎస్పీ టీం

సూర్యాపేటటౌన్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ టీంపై ఎస్పీ టీం గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్పీ టీం నిర్ణీత 12 ఓవర్లలో 105 పరుగులు చేసింది. ఎస్పీ రాజేంద్రప్రసాద్ 8పరుగులతో నాట్ ఔట్‌గా నిలిచారు. 106 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కలెక్టర్ టీం గెలుపు లక్ష్యం అందుకోలేదు. కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ 18 పరుగులు చేశారు. కార్యక్రమంలో అధికారులు మోహన్‌రావు, రాజేంద్రప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సురేష్, రామారావు నాయక్, నాగభూషణం, రాజశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్, ఎస్పీ టీంలు



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ టీం



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్



బౌలింగ్ చేస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

కంటి వెలుగును వేగవంతం చేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): కంటి వెలుగును మరింత వేగవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటా చలం అన్నారు. బుధవారం చింతలపాలెం మండలంలోని కిష్టాపురంలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఓపీ వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. అంతకు ముందు కిష్టాపురంలో కొనసాగుతున్న జ్వర సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాహితి, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్ సింగ్, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సీసీ భాస్కరరాజు, హెచ్‌ఈఓ శ్రీనివాసరాజు, ఎల్‌టీ శ్రీనివాసరెడ్డి, కంటి వెలుగు సూపర్‌వైజర్ గోవిందమ్మ పాల్గొన్నారు.

సైదన్న ఉర్సుకు సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ముస్తాబైన జాన్‌పహాడ్ దర్గా
- రేపు గంధం ఊరేగింపు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు



విద్యుత్ కాంతుల్లో జాన్‌పహాడ్ దర్గా

పాలకవీడు: విభిన్న మతాల ఆధ్యాత్మిక ఝరి జాన్‌పహాడ్ దర్గా క్షేత్రం. మతసామరస్యానికి ప్రతీకగా భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా విరాజిల్లుతోంది. ఈ దర్గా ఉర్సు గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వక్ఫ్‌బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది.

ఎలాంటి అసౌకర్యం కలగకుండా..

ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. పోలీస్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపడతారు. మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మంచినీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్, డెక్కన్ పరిశ్రమ వారు ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు దర్గా వద్ద వివిధ ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. శూన్యపహాడ్, పాలకవీడు రూట్‌ల నుంచి వచ్చే వాహనాలను రెండు రోజులపాటు దర్గా ప్రాంతంలోకి అనుమతించరు. కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది పోలీస్, స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరాకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

శూన్యపహాడ్ రూట్‌లో పార్కింగ్ ప్రదేశం సమీపంలో ఉన్న లోలెవల వంతెన సైడ్ రెయిలింగ్ లేక ప్రమాదకరంగా ఉంది. దర్గా నుంచి కృష్ణానదికి వెళ్లే మార్గంలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి జేసీబీతో గాడి తీసి పూడ్చక వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉంది. మహంకాళిగూడెం కృష్ణా నది పుష్కరఘాట్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నదిలోపలికి వెళ్లకుండా భక్తులను అప్రమత్తం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు రోజులు ఇలా..

- నేడు సూర్యోదయానికి ముందే బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులతో ఉల్సా నిర్వహించి ఉర్సును ప్రారంభిస్తారు.
- 27న ప్రధాన ఘట్టమైన పవిత్ర గంధం ఊరేగింపు ఉంటుంది. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రార్ధనల మధ్య తయారు చేసిన పవిత్ర గంధాన్ని శుక్రవారం జాన్‌పహాడ్ గ్రామానికి తెచ్చి అక్కడి నుంచి అశ్వంపై ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చి బాబా సమాధులకు సమర్పిస్తారు.
- 28న దీపారాధనతో జాన్‌పహాడ్ ఉర్సు ముగిస్తారు.

సర్వ మతాల సమ్మిళితం.. జాన్‌పహాడ్ దర్గా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు: సర్వమతాల సమ్మిళితం జాన్‌పహాడ్ దర్గా అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి దర్గాను దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని,దీనిలో భాగంగా జాన్‌పహాడ్ దర్గాలో మౌలిక వసతుల కల్పనకు రూ. 50 లక్షలు, మెళ్లచెరువు శివాలయానికి రూ. 50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. డీఎంఎఫ్‌టీ నుంచి దర్గాకు మరో రూ. 30 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల్లో వివిధ వస్తువులపై అక్రమంగా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, దౌర్జన్యాలకు పాల్పడితే పీడీయాక్టు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఉత్సవాలకు శుక్రవారం రాష్ట్ర మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్ రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం ఉర్సు ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం, మంచినీరు, వైద్యం, విద్యుత్ తదితర వసతుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మలిమంటి దర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వివిధశాఖల అధికారులు, నాయకులు భూక్యా రవి, షేషురెడ్డి, పసుపులేటి సైదులు, అచ్చమ్మ, భిక్షం, లక్ష్మారెడ్డి, విజయ్, సతీష్, చందునాయక్, మహబూబ్‌అలీ, రాజశేఖర్ పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

జెండా పండుగకు వేళాయే

- నేడు గణతంత్ర వేడుకలు
- ముస్తాబైన కలెక్టరేట్
- ఉదయం 9గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్



గణతంత్ర వేడుకలకు కలెక్టరేట్‌లో ముస్తాబైన వేదిక

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. నేడు జరగనున్న వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబైంది. రంగురంగులతో కలెక్టరేట్‌ను అలంకరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అలంకరించి వేడుకలకు సిద్ధం చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉదయం 8గంటల నుంచి సాంస్కృతిక సారథి బృందాలతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లాలో అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు , అతిథులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ఇదిలా ఉంటే గతంలో గణతంత్ర వేడుకలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించేవారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇక జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా ఏర్పాటు చేసే స్టాల్స్, శకటాల ప్రదర్శన ఈ సారి చేపట్టడం లేదు.

షెడ్యూల్ ఇలా..

- ఉదయం 8.55 గంటలకు ఆత్మీయపతాకానికి పోలీస్ వారిచే వందన సమర్పణ
- 9 గంటలకు కలెక్టర్‌చే జెండా ఆవిష్కరణ
- 9. 05 గంటలకు కలెక్టర్ సందేశం
- 9. 20 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులు, అతిథుల పరిచయ కార్యక్రమం
- 9. 30 గంటలకు విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు
- 9.45 గంటలకు ప్రశంసా పత్రాల ప్రదానం
- 10 గంటలకు కార్యక్రమం ముగింపు

ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు, చిత్రంలో నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, శాసన మండలి మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటి నుంచి కేంద్ర బడ్జెట్, ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాలని, సంక్షేమ రంగానికి నిధులు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నాయి తప్ప కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ లోనైనా గత సంవత్సరం ఖర్చు చేయని నిధులను కలిపి కొత్తగా నిధులు కేటాయించాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. మిర్యాలగూడ నుంచి సూర్యాపేట మీదుగా కాజీపేట వరకు రైలు మార్గం ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీజేపీని ఓడించడమే సీపీఎం రాజకీయ కర్తవ్యమని, బీఆర్‌ఎస్‌తో కలిసి పని చేసినంత మాత్రాన ప్రజా సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల సందర్భంగా మాత్రమే పొత్తుల గురించి ఆలోచిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డీ. జహంగీర్, బట్టుపల్లి అనురాధ, మట్టిపెల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, గోపి పాల్గొన్నారు.

విద్యతో వెలుగు.. క్రీడలతో స్ఫూర్తి



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యం
- సూర్యాపేటలో క్రీడా పోటీలను ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : విద్యతో వెలుగు.. క్రీడలతో స్ఫూర్తి వస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని సూర్యాపేట నియోజకవర్గ స్థాయి జీజేఆర్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో ఓటమిని తట్టుకొని గెలుపొందాలంటే క్రీడా స్ఫూర్తి అవసరమన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం కేసీఆర్ చొరవతోనే రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యం ఉంటోందన్నారు. యువత కోసం త్వరలో క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ డీఈఓ అశోక్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ గతిని మార్చగల శక్తి ఓటుకు ఉందన్నారు. ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి వ్యవస్థ మార్పునకు నాంది పలికేదే ఓటు అని పేర్కొన్నారు. మీకు ఇష్టమైన వ్యక్తిని ఎన్నుకోవాలంటే 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్క యువత ఓటు అనే ఆయుధాన్ని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ప్రిన్సిపల్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిపై తెగుళ్ల పంజా

- పంటకు ఆశించిన ఆకు ముడత, మొగి పురుగు, అగ్గి తెగులు
- ఎర్రబారిపోతున్న పంట చేలు
- వాతావరణ మార్పుల వల్లనే అంటున్న వ్యవసాయ అధికారులు
- ఎన్ని మందులు కొట్టినా అదుపులోకి రాని పరిస్థితి



తాటిపాములలో అగ్గి తెగులు సోకిన వరి చేను



ఈ ఫొటోలోని రైతు పేరు అంజయ్య. తిరుమలగిరి మండలం తాటిపాముల. తనకున్న 12 ఎకరాలలో రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశాడు. పది రోజులుగా పంటకు మొగి తెగులు సోకి ఎర్రగా మారింది. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పొలం పచ్చగా మారడం లేదు. పొలానికి తెగులు సోకడంతో అదనంగా పెట్టుబడి మీద పడుతోంది. ఈ పరిస్థితిలో పంట దిగుబడి తగ్గి నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ఇది జిల్లాలో యాసంగిలో వరి సాగు చేసిన రైతుల పరిస్థితికి నిదర్శనం.

తిరుమలగిరి (తుంగతుర్తి): అన్నదాతలను కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. పంట వేసింది మొదలుకొని చేతికి అందే వరకు ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొంటున్నారు. యాసంగి పంటల సాగుకు శ్రీకారం చుట్టిన ప్రారంభంలోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వరి వేసిన 15 రోజుల్లోనే పంటకు ఆకు ముడత పురుగు, అగ్గి తెగులు, మొగి పురుగు సోకాయి. ఈ తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పురుగు మందులు పిచికారీ చేయడానికి రైతులు అధికంగా ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు.

4.31లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో అత్యధికంగా బోర్లు, బావులపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ సారి యాసంగి సీజన్‌లో 4.52లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు సమృద్ధిగా లభిస్తున్నాయి. దీంతో రైతులు ఎప్పట్లాగే ఈసారి కూడా వరి సాగుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈసారి ఆంక్షలు ఎత్తి కూడా ఎత్తి వేయడంతో 4,31,710 ఎకరాల్లో వరి సాగు చేశారు.

దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం

వరి పంటలో మొగి పురుగు, అగ్గి తెగులు, ఆకు ముడత పురుగులు వ్యాప్తి చెందుతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల తెగుళ్లు సోకుతున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొగి పురుగుల ఉధృతితో పైరులో మువ్వ ఎండిపోయి బియ్యం గింజ పరిమాణంలో లార్వా వ్యాపిస్తోంది. దీని వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ముప్పు ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్గి తెగులు వల్ల పొలాలన్నీ ఎర్రబారిపోతున్నాయి. వీటి నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్ట పోతున్నారు. సస్య రక్షణ చర్యలతో పెట్టుబడి ఖర్చులు మరింత పెరుగుతున్నాయి.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



“ వరి పైరులో సస్య రక్షణ చర్యలు పాటించడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. వాతావరణం మార్పుల వల్ల ఈ తెగుళ్లు సోకుతున్నాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా అధికారుల సూచనలు పాటించి మందులు పిచికారీ చేయాలి.

రామారావు నాయక్,
జిల్లా వ్యవసాయ అధికారి.

నివారణకు..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అగ్గి తెగులు సోకడానికి అవకాశం ఉందని, వీటి నివారణకు 0.6 గ్రాముల ట్రై సైక్లాజోల్ లేదా 1.మి.మీ.ఐసో ప్రోథయోలిన్ లేదా 2.5 మి.లీ. కాసుగా మైసింగ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు ఉన్నట్లయితే 2 గ్రాముల కార్టాప్, హైడ్రోక్లోరైడ్ 50 గ్రాముల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భువనగిరి: పట్టణ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. జనగామ జిల్లాకు చెందిన రంగు శ్రీనివాస్ తన కుమార్తె రమ్య, కుమారుడు లక్ష్మణ్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్ సమీపంలోకి రాగానే హెల్మెట్ అద్దం కిందికి రావడంతో శ్రీనివాస్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

వలస కూలీ కుటుంబంలో విషాదం


ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు


అంజమ్మ (ఫైల్)


మధుమతి (చిన్ననాటి ఫొటో)

- గ్యాస్ సిలిండర్ పేలి తల్లి, కుమార్తె దుర్మరణం
- మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్‌లో ఘటన
- ఉపాధి నిమిత్తం చేగుంట నుంచి రాజాపేటకు వలస వచ్చిన కుటుంబం

రాజాపేట: మెదక్ జిల్లా నుంచి రాజాపేట మండలానికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న వ్యక్తి కుటుంబంలో విషాదం నెలకొంది. గ్యాస్ సిలిండర్ పేలి అతడి తల్లి, కుమార్తె మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చిన్నశివునూర్ గ్రామానికి చెందిన పిట్టల రాకేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రాకేష్ ఉపాధి నిమిత్తం తల్లి అంజమ్మ(65), కుటుంబంతో కలిసి తన అత్తగారి ఊరైన యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడేనికి నాలుగేళ్ల క్రితం వలస వచ్చి స్థానికంగా పౌల్ట్రీఫాంలో పనికి కుదిరాడు. అయితే అతడి తోడల్లుడు హైదరాబాద్ నుంచి రాజాపేట మండలంలోని పిట్టలగూడెం గ్రామానికి వలస వచ్చి జీవనోపాధి పొందుతున్నాడు. తోడల్లుడి సూచనతో రాకేష్ కూడా 10రోజుల క్రితం కుటుంబంతో కలిసి పిట్టలగూడేనికి మకాం మార్చి స్థానికంగా ఓ ప్రైవేట్ సోలార్ ప్రాజెక్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. భార్య పత్తి కూలీగా పనిచేస్తుండగా, అతడి తల్లి అంజమ్మ ఇంటి వద్దే ఉంటూ పిల్లలను చూస్తుండేది. అంజమ్మ రెండుమూడు నెలలకు ఒకసారి స్వగ్రామం చిన్నశివునూర్‌కు వెళ్లి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తీసుకొచ్చుకునేది. గత రెండు మూడు నెలల నుంచి ఆమె పింఛన్ కోసం వెళ్లకపోవడంతో తన పింఛన్ తొలగిస్తారేమోనని మంగళవారం ఉదయం రాకేష్ పెద్ద కుమార్తె మధుమతి(6)తో కలిసి స్వగ్రామానికి వెళ్లింది. రాత్రి కావడంతో అక్కడే తన ఇంట్లో మనుమరాలితో కలిసి నిద్రించింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అర్ధరాత్రి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరూ మృతిచెందారు. సమాచారం అందుకున్న రాకేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం స్వగ్రామానికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని అక్కడే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు సమాచారం.

సిలిండర్ ఎలా పేలింది?

అయితే గ్యాస్ సిలిండర్ ఎలా పేలిందనే విషయమై చేగుంట పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. అంజమ్మ రాజమ్మ ఇంట్లో కరెంట్ సౌకర్యం లేదని, రాత్రి నిద్రించే సమయంలో కొవ్వొత్తి వెలిగించిందని, ఆ సమయంలోనే గ్యాస్ లీక్ అయ్యి సిలిండర్ పేలిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాసర అమ్మవారికి పోచంపల్లి పట్టుచీరలు


అమ్మవారికి బహూకరించడానికి తయారు చేసిన పోచంపల్లి ఇక్కత్ చీర


తయారుచేసిన పట్టు చీరలు

భూదాన్‌పోచంపల్లి: బాసరలో శ్రీ సరస్వతీదేవితో పాటు లక్ష్మీదేవి, మహంకాళి అమ్మవార్లకు బహూకరించేందుకు పోచంపల్లి చేనేత కళాకారులు మూడు ఇక్కత్ పట్టుచీరలను రూపొందించారు. అలాగే వేదవ్యాస రుషికి పట్టు పంచె, శాలువాను కూడా తయారు చేసి బుధవారం నిర్వాహకులకు అందజేశారు. ప్రతి ఏటా వసంతోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవార్లను అలంకరించడానికి బాసరలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టుచీరలను తయారు చేయిస్తారు. అందులో భాగంగా ఈసారి పోచంపల్లి ఇక్కత్ చీరలను బహూకరించడానికి పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, మారెపల్లి పురుషోత్తం, కడవేరు రాజేశ్‌లను బాసరకు పిలిపించారు. వారు అక్కడే ఆరు రోజుల పాటు ఎంతో నిష్ఠతో రాత్రింబవళ్లు మగ్గంపై 9 గజాల చీర, పంచె, శాలువా నేశారు. బుధవారం వాటిని పద్మశాలీ సంఘం ప్రతినిధులకు అందజేశారు. కాగా, గురువారం నిర్వహించనున్న వసంతోత్సవంలో భాగంగా అమ్మవార్లకు పట్టు చీరలు, వేద వ్యాసరుషికి పంచను బహూకరించనున్నారని చేనేత కళాకారులు తెలిపారు. బాసర జ్ఞానసరస్వతీదేవికి, లక్ష్మీదేవి, మహంకాళి అమ్మవారు, వేదవ్యాసరుషికి పట్టు వస్త్రాలను తయారు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చేనేత కళాకారుడు మేకల రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశాడు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం


కోటిరెడ్డి మృతదేహం

హాలియా: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్‌నగర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన మల్‌రెడ్డి కోటిరెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై హాలియాకు వచ్చిన ఆయన రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈశ్వర్‌నగర్ శివారులోకి చేరుకోగానే పీఏపల్లి నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వృద్ధుడు మృతి


సత్తిరెడ్డి (ఫైల్)

రామన్నపేట: మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పేరాల సత్తిరెడ్డి మృతిచెందినట్లు రామన్నపేట పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పేరాల సత్తిరెడ్డి(80) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 19న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 21న రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం సాయంత్రం లక్ష్మాపురం శివారులోని చెరువు వద్ద సత్తిరెడ్డి విగతజీవిగా పడి ఉండడం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దారి తప్పిపోయిన సత్తిరెడ్డి చెరువు సమీపంలో సొమ్మసిల్లి పడిపోయి మృతిచెంది ఉంటాడని, అతడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మేనల్లుడు కొండల్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థి అదృశ్యం


ప్రణయ్‌కుమార్

మునగాల(కోదాడ): మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బాషపంగు ప్రణయ్‌కుమార్ గత రెండు రోజులుగా కనిపించడం లేదని బుధవారం అతడి తండ్రి బాషపంగు శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ప్రణయ్‌కుమార్ ప్రస్తుతం ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని సోమవారం రాత్రి 8గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇంతవరకు తిరిగి రాలేదని అతడి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రణయ్‌కుమార్ మానసికస్థితి సరిగా లేకపోవడంతో గతంలో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ప్రణయ్‌కుమార్ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ మునగాల శివారులో గల సాగర్ ఎడమ కాలువ ఒడ్డున ఉన్నట్లు తెలియడంతో తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి చూడగా అతడి జాడ తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్త నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేసి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు పరిశీలన

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామ శివారులో బొక్కా యాదిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని చేపల చెరువును బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి పరిశీలించారు. చేపల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆ గ్రామానికి చెందిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఓఎస్‌డీ దేవేందర్‌రెడ్డి తల్లి భద్రమ్మ దశదిన కర్మలో పాల్గొన్నారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాలెం మల్లేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


చేపల చెరువును పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఓటు హక్కు గురించి భావితరాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాధ్యతగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర రెడ్డి, రవి, ఏఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ నర్సింహ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గౌరీనాయుడు, సీఐలు సోమనారాయణసింగ్, రాజశేఖర్, ఆంజనేయులు, శివశంకర్, పీఎస్‌ఐ ప్రసాద్, రాజేష్, నాగార్జున, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, ఎంటీఓ శ్రీనివాస్, వెల్ఫేర్ గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.


డీజీపీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ..

కేసుల స్థితిగతులు, ఆన్‌లైన్ నమోదు, కమ్యూనిటీ కార్యక్రమాలు, మహిళల రక్షణ, సాంకేతికత, ఆధునిక పోలీసింగ్ మొదలగు అంశాలపై బుధవారం డీజీపీ అంజనీకుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఏఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతం: ఎమ్మెల్యే బొల్లం


ఆవులు, దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు: చిలుకూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మేలు జాతి ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతంగా ఉందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. చిలుకూరు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమలో రాణిస్తే ఆర్థికంగా బలోపేతం కావొచ్చునని అన్నారు. మండల వ్యాప్తంగా 200 దూడలు, ఆవులను రైతులు ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు. పుంగనూరు, ఒంగోలు, హెచ్‌ఎఫ్(బ్లాక్ ఆవులు), జెర్సీ, గిరి జాతి ఆవులు, ముర్రా జాతి దూడలను ప్రదర్శించారు. కొడారు వెంకటేశ్వర్లుకు చెందిన పుంగనూరు జాతి ఆవు, కాశబోయిన రంగారావు హెచ్‌ఎఫ్ జాతి ఆవు, షేక్ సాహెబ్ అలీ గిరిజాతి ఆవు, గోగుల వీరభద్రం జెర్సీ ఆవు, నాగిరెడ్డి నారాయణరెడ్డి ఒంగోలు జాతి ఆవు ప్రథమ బహుమతులు సాధించాయి. అదేవిధంగా బెక్కం వీరబాబు, కొడారు శ్రీనుకు చెందిన ఆవుల దూడలు, గంగిరెడ్డి నాగిరెడ్డి, బానోతు శ్రీను, గుజ్జుల అంజిరెడ్డి, బహుదొడ్డి వెంకటయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లుకు చెందిన గేదె దూడలు ప్రథమ బహుమతులు సాధించగా, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, సర్పంచ్ కొడారు బాబు, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, హుజూర్‌నగర్ సహాయ సంచాలకుడు డాక్టర్ రూపకుమార్, పశువైద్యాధికారులు వీరారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాచకుడు మృతి

నార్కట్‌పల్లి: మండలంలో చెర్వుగట్టు క్షేత్రంలో యాచకుడిగా(55) జీవనం సాగిస్తున్న వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినటుల నార్కట్‌పల్లి ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం

- తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్
- చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మృతి

కోదాడరూరల్: ట్రాక్టర్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం బైపాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన యరమాల ఉపేందర్(31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌పై కోదాడ నుంచి శ్రీరంగాపురం బైపాస్ మీదుగా తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్ తెలిపారు.

కారు ఢీకొని గొర్రెల కాపరి మృతి

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి గొర్రెల కాపరిని ఢీకొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన దాసరి రాములు(58) గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అతడు గొర్రెలను మేపేందుకు సూర్యాపేట వైపు తోలుకుని వెళ్తుండగా దురాజ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ

- కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

డిండి: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలోని కామేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి గ్రామానికి చెందిన గోరటి బాలయ్య, నల్ల వెంకటయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురి మధ్య పాత కక్షలు ఉండడంతో తరుచూ గొడవ పడుతుండేవారు. సోమవారం రాత్రి బాలయ్య ఇంటి వద్దకు వెళ్లిన వెంకటయ్య ఇరువురు మాట్లాడుకుంటున్న క్రమంలో మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో వెంకటయ్య తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో బాలయ్యపై దాడి చేశాడు. దీంతో బాలయ్య తల, చెవికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గమనించి బాలయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

హుజూర్‌నగర్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటార్ సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దొంగిలించారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్ కాలనీకి చెందిన మాలోతు రంగా మంగళవారం రాత్రి ఇంటి ముందు తన మోటార్ సైకిల్‌ను పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం చూసేసరికి దానిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో రంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

మఠంపల్లి: మఠంపల్లిలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన రామకృష్ణ మట్టపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా అదే సమయంలో మండలంలోని పెదవీడుకు చెందిన నరసింహారావు మఠంపల్లి నుంచి పెదవీడుకు బైక్‌పై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెండు బైకులు రోడ్డు పక్కన పడగా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఇరువురిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. పోలీసులు ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

వేరుశనగ సాగుచేసిన రైతులకు జిప్సమ్ పంపిణీ


రైతులకు జిప్సమ్ పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: మండలంలోని గానుగుబండలో వేరుశనగ పంట సాగుచేస్తున్న ముగ్గురు రైతులకు బుధవారం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో జిప్సమ్ పంపిణీ చేసినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి. లకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలోనే ఉందని, ఈ సమయంలో ఎకరానికి 200కేజీల జిప్సమ్‌ను మొక్కల మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలని, ఆ తర్వాత ఎటువంటి అంతరకృషి చేయకూడదని అన్నారు. జింక్ లోపం ఉన్నట్లు అయితే దానిని నివారించేందుకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి. నరేష్, గానుగుబండ గ్రామ రైతులు కొత్త వెంకట్‌రెడ్డి, అన్నెం సైదిరెడ్డి, నాగుల మీరా తదితరులున్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమించాలి

- మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కార్మికులంతా ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో బుధవారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను హరించి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.యూసూఫ్, ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ గతేడాది నవంబర్ 27, 28, 29వ తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యాయని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, కోశాధికారి గోరేటి రాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పసుల అభిలాష్, ఉప్పల శాంతికుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత తదితరులున్నారు.